క్లుప్తంగా

'పదోన్నతుల్లో సీనియర్ ఎస్జీటీలకు అన్యాయం'



దండేపల్లి: నిరసన తెలుపుతున్న ఎస్జీటీలు

దండేపల్లి: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియర్ ఎస్జీటీలకు అన్యాయం జరిగిందని మండలంలోని పనిచేస్తున్న పలువురు సీనియర్ ఎస్జీటీలు ఆరోపించారు. మండలంలో పనిచేస్తున్న పలువురు సీనియర్ ఎస్జీటీలు సోమవారం దండేపల్లిలో సమావేశమయ్యారు. పండిత్, పీఈటీ పోస్టుల్లో అప్‌గ్రేడ్ చేసిన పోస్టులకు పాటించిన కామన్ సీనియార్టీ రూల్స్, ఎస్టీటీలకు కూడా వర్తింపజేయాలన్నారు. బీఈడీ, డీఈడీ అని కాకుండా, కామన్‌గా పీఎస్‌హెచ్‌ఎంగా పదోన్నతి కల్పించాన్నారు. ప్రతీ ప్రైమరీ పాఠశాలలో సబ్జెక్టుకు ఒక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. 25ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఎస్జీటీలకు ప్రమోషన్ కల్పించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎస్జీటీలు కమలాకర్, సంపత్, కాంతరావ్, సుజాత, కవిత, మంజుల పాల్గొన్నారు.

పాన్ కార్డు లింక్ చేసుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరూ తమ పాన్‌కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాన్‌కార్డు లింక్ చేసుకోవడానికి ఈ నెల 30వరకే ఆదాయపన్ను అవకాశం కల్పించిందన్నారు. లింక్ చేయకుంటే వేతనాలు, ఆదాయపన్ను తదితర సమస్యల్లో ఇబ్బంది కలుగుతుందన్నారు. కావున వెంటనే పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేసుకోవాలని సూచించారు.

ఈ-పాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరపాలి



తనిఖీ చేస్తున్న డీఏవో

జన్నారం: ఎరువుల దుకాణాల్లో ఈ పాస్ మిషన్ ద్వారా అమ్మకాలు జరిపి వివరాలు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఎరువులను, కల్తీ లేని విత్తనాలను రైతులకు అందించాలని సూచించారు. డీఏవో వెంట ఏవో సంగీత, ఏఈవో మధుకర్ ఉన్నారు.

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవికుమార్



నియామకపత్రం అందుకుంటున్న రవికుమార్

దండేపల్లి: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దండేపల్లి మండలం ధర్మరావ్‌పేట గ్రామానికి చెందిన కొల్లూరి రవికుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ మధు సోమవారం నియామకపత్రం అందించారు. తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై నరేష్

బెల్లంపల్లిరూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తాళ్లగురిజాల పోలీసులు చాకచక్యంగా పట్టుకుని బాధితుడికి అందజేసిన ఘటన సోమవారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. బెల్లంపల్లికి చెందిన కాసర్ల యాదగిరి అనే వ్యక్తి కన్నాల శివారులో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు యాదగిరి తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ అధునాతన సాంకేతికతను వినియోగించి సెల్‌ఫోన్‌ను రెండు గంటల వ్యవధిలోనే పట్టుకుని బాధితుడికి అప్పగించాడు. గంటల వ్యవధిలోనే పోయిన సెల్‌ఫోన్ పట్టుకుని బాధితుడికి అప్పగించడంతో పలువురు పోలీసుల పనితీరుని అభినందించారు.

చిన్ననీటి వనరులపై నిర్లక్ష్యం!

- చెరువులు, కుంటలపై పట్టింపేది..?
- పిచ్చిమొక్కలతో తగ్గుతున్న నిల్వ సామర్థ్యం
- మరమ్మతులపై దృష్టి సారించని యంత్రాంగం
- సాగు నీరందక రైతులకు ఇబ్బందులు



భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మాలగురిజాలలోని పోచమ్మకుంట చెరువు మత్తడి

సబ్ డివిజన్‌లో చెరువుల వివరాలు

సబ్ డివిజన్‌లోని మండలాలు	-	బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, భీమిని
చెరువుల సంఖ్య	-	153
వంద ఎకరాలపైబడి ఆయకట్టు	-	35
వంద ఎకరాల్లోపు ఆయకట్టు	-	118
మొత్తం ఆయకట్టు	-	32,615 ఎకరాలు

బెల్లంపల్లి: పంటల సాగుకు నీరందించే చిన్ననీటి వనరులపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నీటి పారుదల శాఖ బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు ఏళ్ల తరబడి నుంచి నిరాదరణకు గురవుతున్నాయి. వీటిపై నీటి పారుదల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు సరైన దృష్టి సారించలేక పోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతుండగా, క్రమంగా రైతులు ఆశలు వదులుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి.

తూములు.. మత్తళ్లకు గండ్లు..

గడిచిన నాలుగేళ్ల నుంచి చెరువులపై కనీస శ్రద్ధ చూపడం లేదు. భారీ వర్షాలు కురిసి, వరదలు వచ్చి గండ్లు పడ్డా పట్టించుకోవడం లేదు. పలు గ్రామాల్లో మత్తళ్లు వరదలకు కొట్టుకుపోగా, తూములకు గండి పడ్డ పరిస్థితులూ ఉన్నాయి. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, భీమిని మండలాల పరిధిలో ఉన్న పలు చెరువులు, కుంటలు కనీస మరమ్మతులకు నోచుకోకపోతున్నాయి. సాధారణంగా వానాకాలం పంట సాగుకు ముందస్తుగా గండ్లు పడిన చెరువులను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాల్సి ఉండగా అశ్రద్ధ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ముంచుకురావడంతో ఈ సారి కూడా చెరువులకు మరమ్మతు జరిగే అవకాశాలు కానరావడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. గండ్లు పడిన ప్రతీ సారి రైతులు ముందుకొచ్చి చెరువుల్లోని నీరు వృథా పోకుండా అడ్డంగా ఇసుక, సిమెంట్ బస్తాలు వేసి నివారణ చర్యలు చేపట్టడం పరిపాటిగా మారింది.

పడిపోతున్న నీటి నిల్వ సామర్థ్యం

పంటల సాగుకు దోహదపడే చెరువులు క్రమంగా ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చెరువుల్లో ఎందుకూ పనికిరాని పాల సముద్రం చెట్లు, ఇతర రకాల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వీటిని ఏటా నరికి వేయించాల్సి ఉండగా, ఏ చెరువులోనూ ఆ దిశగా యత్నాలు చేసిన పాపాన పోలేదు. ఏళ్ల తరబడి నుంచి పెరుగుతూ వస్తున్న పిచ్చి మొక్కలు చెరువంతా విస్తరించి ఉన్నాయి. సబ్ డివిజన్ వ్యాప్తంగా ప్రతి చెరువులోనూ ఈ తీరైన పరిస్థితులే దర్శనమిస్తున్నా, నీటి పారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మరో పక్క పూడిక సమస్య తీవ్రంగా ఉంది. భారీ వర్షాలు, వరదలతో కొట్టుకొచ్చిన మట్టి, ఇసుక చెరువు భూగర్భంలో నిల్వ ఉండిపోతున్నాయి. దీంతో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం క్రమంగా పడిపోతోంది. రెండు పంటలకు సరిపడా సాగు నీరందించాల్సిన చెరువులు, కనీసం ఒక పంటకు సైతం పూర్తిస్థాయిలో నీటి తడులు అందించలేకపోతున్న దుస్థితి కనిపిస్తోంది. దీంతో రైతులు అనివార్యంగా వర్షాధారంపై ఆధారపడి సేద్యం చేయాల్సి వస్తోంది.

తగ్గుతున్న ఆయకట్టు..

చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుముఖం పడుతుండటంతో పంటల సాగుకు కష్టాలు ఎదురవుతున్నాయి. చెరువులను ఆధారం చేసుకొని వరిసాగు చేయడం దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఏళ్ల తరబడి నుంచి పూడిక తీయించకపోవడంతో చెరువుల్లో మట్టి దిబ్బలు ఏర్పడి, నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. దీంతో అనివార్యంగా సాగునీటి కటకట ఏర్పడుతోంది. పంట చేతికందే సమయంలో చెరువుల్లో నీరుండని పరిస్థితులు ఏర్పడి, పంట నష్టపోతున్నారు. చెరువు కాల్వలు కూడా అధ్వానంగా తయారయ్యాయి. గడిచిన కొన్నేళ్ల నుంచి ఈ తీరైన పరిస్థితులు దాపురిస్తుండటంతో, సాగునీటికి కష్టపడే కన్నా సాగు చేయకుండా పొలాలను బీళ్లుగా వదిలేయడానికి సిద్ధపడుతున్నారు. ఏళ్ల తరబడి నుంచి వస్తున్న నిర్లక్ష్యాన్ని వీడి గండ్లు పడిన చెరువులకు మరమ్మతు చేయించి, నీటి నిల్వను పెంచడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

గండ్లు పడిన చెరువులకు మరమ్మతు చేయించడానికి నిధుల మంజూరు కోసం ఈ పాటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. సబ్ డివిజన్ వ్యాప్తంగా 20వరకు చెరువులకు గండ్లు పడ్డాయి. వీటిని మరమ్మతు చేయాల్సిన అవసరాన్ని గుర్తించాం. మిగితా చెరువులన్నీ దాదాపు బాగానే ఉన్నాయి. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం.

\- నరేన్, డీఈ, మైనర్‌ఇరిగేషన్, బెల్లంపల్లి

కలెక్టర్‌కు సన్మానం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాకు ఇటీవల బదిలీపై వచ్చిన కలెక్టర్ కుమార్‌దీపక్‌ను టీయూడబ్ల్యూజేయూ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ చాంబర్‌లో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డేగ సత్యం, సంపత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపురెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఐజేయూ మెంబర్ కాసం సతీష్‌రెడ్డి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు ట్రైనింగ్



ట్రైనింగ్ ఇస్తున్న సీడీపీవో ఉమాదేవి

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ రైతువేదికలో సుమారు అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో ఉమాదేవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన పాఠ్య ప్రణాళిక బోధన పద్ధతులను తప్పనిసరిగా పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో అర్థమయ్యే విధంగా చిన్నారులకు బోధన చేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం మూడు రోజుల పాటు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మమత, ఇందిరా, రమాదేవి, సృజన తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నస్పూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ ప్రకాష్ అన్నారు. నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. లైంగిక వేధింపులు, ఆత్మహత్యలు, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. నేటి సమాజంలో చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, నస్పూర్ ఎస్సై రవికుమార్, జితెందర్ పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు స్థలం పరిశీలన



సర్వేపత్రాలను కార్యదర్శికి అందిస్తున్న సర్వేయర్

వేమనపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మరుగుదొడ్ల కష్టాలు తీరనున్నాయి. గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ పథకం కింద కమ్యూనిటీ సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో సత్యప్రసాద్, సెర్ప్ ఏపీఎం ఉమారాణి బస్టాండ్‌కు వెళ్లి స్థల పరిశీలన చేశారు. వేమనపల్లి బస్టాండ్ పక్కనే ఉన్న మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి దహెగాం, బెజ్జూర్, భీమిని మండలాల నుంచి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు లేక ఏళ్ల తరబడి చిన్న పిల్లలు, మహిళలకు కష్టాలు తప్పలేదు. ఎస్‌బీఎం నిధులతో మరుగుదొడ్లు మంజూరు కాగా గ్రామ పంచాయతీ వెనుకాల ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించడానికి పరిశీలన చేశారు.

భీమారంలో భూమి సర్వే

భీమారం: మండలకేంద్రంలో ప్రయాణికుల కోసం సులభ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రభుత్వభూమిలో సర్వే చేసి సర్వే పత్రాలను సర్వేయర్ నాగరాజు కార్యదర్శి శ్రీనివాస్‌కి అందజేశారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తంగళ్లపల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రయాణం చేసే మహిళలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని ఎమ్మెల్యే వివేక్‌ను కోరగా అందుకు అంగీకరించారని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు గద్దె రాంరెడ్డి, అర్కాల రమేష్ పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు

భీమారం: మండలంలోని నర్సింగాపూర్‌లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి రెవెన్యూ శాఖ 466 సర్వేనంబరులో ఎకరం భూమి కేటాయించినట్లు తెలిపారు. మండలం మొత్తానికి ఒకే సబ్‌స్టేషన్ ఉండడం వల్ల సరఫరాలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. భూమిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. చెన్నూరు ఏడీఏ రవికుమార్, భీమారం ఏఈ కుమారస్వామి, జెడ్పీటీసీ బుక్యా తిరుమల, మండల కాంగ్రెస్ నాయకులు బుక్యా లక్ష్మణ్, కొక్కుల నరేష్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్: వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతి పత్రం అందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్‌ను అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రతి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ డేకేర్ సెంటర్ ఫర్ సీనియర్ సిటిజన్స్‌కు ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రుల, వయోధికుల పోషణ, సంక్షేమం చట్టం 2007ను అమలు చేయాలని, పోలీస్ శాఖ నుంచి పెద్దల ప్రాణాలకు, ఆస్తి రక్షణకు ఆదేశాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి.శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జి.కనకయ్య, కోశాధికారి బి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎస్.రాంచందర్, వి.లింగం, ఈ.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ ఏ.సత్తయ్య, బి.రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

మంచిర్యాలటౌన్: బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీజేవైఎం నాయకులు నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ.. అబద్దాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 200రోజుల పాలన పూర్తి చేసుకున్నా, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న మాదిరిగా ఉందని విమర్శించారు. నిరుద్యోగుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా మారిందని, ఏడు నెలలుగా కాలయాపన చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్తను చెప్పాలని, గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని కోరారు. గ్రూప్ 1, గ్రూప్ 2కు సంబంధించి మరిన్ని పోస్టులను పెంచి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరారు. 25వేలతో మెగా డీఎస్సీని ప్రకటించాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని లేనిపక్షంలో వర్షాకాలం అసెంబ్లీ సమావేశాల్లో యువమోర్చా రాష్ట్ర స్థాయిలో నిరుద్యోగుల పక్షాన అసెంబ్లీ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు అమిరిశెట్టి రాజు, మద్ది సుమన్ యాదవ్, రవణవేణి శ్రీనివాస్, రంగు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బింగి సత్యనారాయణ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు బోయిన హరికృష్ణ రెడ్డి, మల్ల అశోక్, కొండ వెంకటేశ్, సిద్ధార్థ, వెంకటేశ్, సాయికృష్ణ, చిరంజీవి పాల్గొన్నారు.

'ప్రజావాణి' వినేవారేరి



కన్నెపల్లిలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

భీమిని: ప్రజా సమస్యలను విని పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం ప్రజావాణిని నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో ఎంపీడీవోతో పాటు మండల స్థాయి అధికారులందరూ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాల్సి ఉండగా, ఇందుకు భిన్నంగా కన్నెపల్లి మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏపీవో, జూనియర్ అసిస్టెంట్‌లు మాత్రమే ఉన్నారు. మిగితా ముఖ్య అధికారులు ఎవరూ పాల్గొనలేదు. ఎంపీడీవో, ఎంపీవో, ఏవో ఇన్‌చార్జులుగా ఉన్నారు. స్థానికంగా ఉన్న తహసీల్దార్, ఇతర శాఖల అధికారులు సైతం ఎవరూ పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఫిర్యాదుదారులు అధికారులు ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగి వెళ్తున్నారు.

'ప్రజావాణి'కి దరఖాస్తులు నిల్

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో శ్రీపతి బాపురావు అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించారు. తహసీల్దార్ రమేశ్, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, సుజాత, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ అధికారులు పాల్గొన్నారు. కానీ ఎలాంటి అర్జీలు రాలేదు.

గొర్రెల కాపరుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు సోమవారం హైదరాబాద్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి రెండు సంవత్సరాలు గడిచినా, ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేయలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గొర్రెల కోసం డీడీలు కట్టిన వారికి న్యాయం జరిగేలా చూస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్, ముఖ్య సలహాదారు బేరి రాంచందర్, నాయకులు తిరుపతి, వెంకటేశ్వర్లు, సురేందర్, యశ్వంత్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో నేటి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై, చట్టాలపై ఎస్సై గోపతి సురేశ్ అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు, బాలికలతో అసభ్యకరంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, సమస్యలు దృష్టికి వచ్చినా 100 నంబర్‌కు డయల్ చేస్తే తక్షణం సహాయం అందుతుందన్నారు.

విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ

రామకృష్ణాపూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రామకృష్ణాపూర్ పోలీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు రూ.20వేలు విలువ చేసే నోట్ బుక్స్, ఇతర స్టేషనరీని పంపిణీ చేశారు. తమవంతు సాయంగా వీటిని అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

పుస్తకాలు పంపిణీ

దండేపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాలను ప్రిన్సిపాల్ శోభ, సిబ్బంది సోమవారం పంపిణీ చేశారు.

నేడు సమావేశం

పాతమంచిర్యాల: ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సొసైటీ సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. సభ్యులు పనులకు వెళ్లకూడదని, సొసైటీ అనుమతులు లేకుండా పనులు నిర్వహించే సభ్యులపై చర్యలు తీసుకొని జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు.

ఎస్టీపీపీ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

జైపూర్: మండల కేంద్రంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రధాన గేటు ముందు మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారి పక్కన కమ్యూనిటీ పోలీసింగ్ భాగంగా 5సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లుగా ఎస్సై శ్రీధర్ తెలిపారు. సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు.

గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

జన్నారం: ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లి అసువులు బాస్తున్న గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పుదూరి సతీశ్ కోరారు. జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు గద్దల రాజన్న రెండు వారాల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, వారి కుటుంబానికి సోమవారం గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం మురిమడుగు శాఖ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రేపు మండల సమావేశం

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటిలో వానపాము



మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో సోమవారం మున్సిపల్ ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేయగా, అందులో వానపాము రావడం కలకలం రేపింది. వార్డులోని ప్రజలకు మున్సిపల్ ట్యాంకు ద్వారా తాగునీరు పోస్తుండగా, బిందెలో వానపాము తిరుగుతూ కనిపించడంతో ప్రజలు ఆందోళన చెందారు. ఈ విషయమై మున్సిపల్ డీఈ మధుకర్‌ను వివరణ కోరగా తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని, ట్యాంకర్ ద్వారా సరఫరా చేసిన తాగునీటిలో వానపాము వచ్చిందని, ఎక్కడైనా ట్రాక్టర్‌ను పార్కింగ్‌లో పెట్టినప్పుడు అది ట్యాంకర్‌లోకి వెళ్లి ఉంటుందని, తాగునీటి ట్యాంకులు, నీటి సరఫరా చేసే ట్రాక్టర్లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బెల్లంపల్లి విద్యుత్ సిబ్బంది ఫోన్‌నంబర్లు



బెల్లంపల్లి: వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఏదైనా కారణంతో అంతరాయం కలిగినట్లైతే వెంటనే విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేసి సేవలు పొందాలని బెల్లంపల్లి పట్టణ డిస్కం ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ వార్డుల్లోని బస్తీల వారీగా విద్యుత్‌సిబ్బంది ఫోన్ నంబర్లను వెల్లడించారు. 1వ వార్డు కన్నాల బస్తీ, మధునన్న నగర్, 2వార్డు కన్నాల బస్తీ, 14 వార్డు కన్నాల బస్తీ, 15 వార్డు టేకుల బస్తీ, 16వార్డు ఫోస్టాఫీసు బస్తీ, 28 వార్డు హన్మాన్ బస్తీ (1టౌన్ ఏరియా), 29 వార్డు ఫోస్టాఫీసు బస్తీ, 30 వార్డు ఎండి .ఖాశీంబస్తీ, 31 వార్డు హన్మాన్‌బస్తీ, 32 వార్డు బాబుక్యాంపు బస్తీ, 33 వార్డు హన్మాన్ బస్తీ, 34 వార్డు హన్మాన్ బస్తీ, 17 వార్డు షంషీర్‌నగర్, 18వార్డు కాంట్రాక్టర్ బస్తీ, 19 వార్డు బెల్లంపల్లి బస్తీ ప్రజలు జేఎల్ఎం 90002 88372, ఎల్ఎం 83339 94186, ఎల్ఐ 94935 46705, ఎస్ఎల్ఐ 94935 46693, ఎఫ్ఎం 94935 46690, కాల్‌టెక్స్ సబ్‌స్టేషన్ నంబర్ -94910 75269, శివాలయం సబ్‌స్టేషన్ నంబర్– 83310 11367 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. 4 వార్డు గోల్ బంగ్లాబస్తీ, 5 వార్డు నంబర్2 ఇంక్లైన్, 6వార్డు ఇంక్లైన్‌బస్తీ, 7వార్డు సుభాష్‌నగర్, 65 డీప్ ఏరియా, 8వార్డు 65డీప్ ఏరియా, శాంతిఖని బస్తీ, 9 వార్డు సుబ్బారావు పల్లి (రైల్వే కాలనీ), 20 వార్డు రామాలయం ఏరియా, 22 వార్డు బూడిదగడ్డ బస్తీ, ఏఎంసీ, 23 వార్డు స్టేషన్ రోడ్‌కాలనీ, 24 వార్డు అంబేద్కర్ రడగంబాల బస్తీ, 25 వార్డు రైల్వే రడగంబాల బస్తీ, 26 వార్డు అశోక్‌నగర్, పాతమంజీరా, 21 వార్డు బూడిదగడ్డ బస్తీ, 27 వార్డు అశోక్‌నగర్, రాంనగర్ బస్తీ, 10 వార్డు పెద్దనపల్లి(మైక్రో స్టేషన్), 11వార్డు పెద్దనపల్లి రైల్వేస్టేషన్ ఏరియా, 12 వార్డు హౌజింగ్ బోర్డు కాలనీ, 13వార్డు గంగారాం నగర్, గొల్లగూడెం వాసులు జేఎల్ఎం 99494 46532, ఎల్ఎం 83339 94187, ఎస్ఎల్ఐ 94935 46693, ఎఫ్ఎం 94935 46690, కాల్‌టెక్స్ సబ్‌స్టేషన్ నంబర్ 94910 75269 నంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.